క్లుప్తంగా

గిరిజనులకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

టెక్కలి: సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం టెక్కలి మండలంలో పలు గిరిజన గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యులు టంకాల నాగరాజు దంపతుల సౌజన్యంతో సరియాపల్లి, భీంపురం గిరిజన గ్రామాల్లో నిరుపేద వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చంటి, బి.అన్నపూర్ణమ్మ, జగదీశ్వరరావు, ఎం.తాతయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నౌపడ పీహెచ్‌సీ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాదరావు

సంతబొమ్మాళి: నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.ప్రసాద్‌రావు సోమవారం సందర్శించారు. ఉద్యోగుల హాజరు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు జరగనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్స్ పరిమళ, నందిని, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, పీహెచ్‌ఎస్.రాజేశ్వరి, ఈవో గోవిందరావు, సూపర్‌వైజర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం పంపిణీ



తక్షణ సాయం అందిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని తలతంపర-2 సచివాలయం పరిధిలో ప్రధానపుట్టుగకు చెందిన వైఎస్సార్ సీపీ నేత జగన్నాథ బిసాయి(48) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. మృతుని నామినీ నీలా బిసాయికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్ సాహుతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీలాంబర్ బిసాయి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

ఇచ్ఛాపురం రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ కురమాన అప్పారావు అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం బెన్నుగానిపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభ, సామర్థ్యాలను పరీక్షించారు. అభ్యాసన ప్రక్రియల ద్వారా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిరీక్షణరావు, సీఆర్పీ దేవరాజు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య అందిపుచ్చుకోవాలి



హెచ్‌ఎంలకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎంఈఓలు

సోంపేట: సాంకేతిక విద్యను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, కె.కృష్ణంరాజు కోరారు. 8వ తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం సమకూర్చిన 440 ల్యాప్‌టాప్‌లను సోమవారం ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణుగోపాలరావు, తారకేశ్వరి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి సాయం



రూ.10వేలు అందిస్తున్న ఉద్దానం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

వజ్రపుకొత్తూరు: రెయ్యపాడు గ్రామానికి చెందిన మద్దిల ఉమా అనే గృహిణికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో ఉద్దాన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కీలు ఈశ్వరరావు, సభ్యులు వెంకటేష్, హేమారావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



ఇచ్ఛాపురం: సీఎం వీడియోకాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లు

- ఆరోగ్యశ్రీ పరిధి రూ.25లక్షలకు పెంపుపై సర్వత్రా హర్షం



టెక్కలి: వీసీలో పాల్గొన్న టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త వాణి, ఎంపీపీ సరోజనమ్మ

కవిటి: పేదల సంపూర్ణ ఆరోగ్యానికి భరోసాగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి తాను పేదల పక్షపాతిగా నిరూపించుకున్నారని వైఎస్సార్‌సీపీ కవిటి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. సోమవారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ పథకంలో రూ.10లక్షల వరకు అందించే ఉచిత వైద్యసాయం పరిధిని రూ.25లక్షలకు పెంచడం వల్ల ఎంతోమంది పేదలకు లబ్ధి కలుగుతుందన్నారు. ఇటీవల పలాస సభలో సీఎం జగన్ మాట్లాడుతూ అతిత్వరలోనే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. సమావేశంలో నేతలు వై.నీలయ్య, పి.నీలాచలం, పి.శేఖర్, వై.అశోక్, బి.ప్రకాష్, సత్యనారాయణ, ధర్మారావు, ఎస్.అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతున్నట్లుముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయమై ప్రజల్లో అవగాహన కల్పించేలా సీఎం సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్, చిడిపోతు జగన్నాయకులు, జేఏసీ కన్వీనర్ సాలిన ఢిల్లి, పార్టీ నేతలు నీలాపు ఢిల్లీ, పురుషోత్తపురం, ఇచ్ఛాపురం ప్రైమరీ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యులు పాల్గొన్నారు.

టెక్కలి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఉచిత వైద్యం పరిమితి పెంపుపై సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు టెక్కలిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ అట్ల సరోజనమ్మ, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, ఎంపీడీఓ సీహెచ్.లక్ష్మీబాయి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: ఆరోగ్యశ్రీ పథకం పెంపుపై సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, ఈఓ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ దున్న మాధవరావు, పార్టీ నాయకులు రేగు బాలయ్య, మద్దు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కవిటి: సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ కె.ప్రకాష్, నాయకులు



సోంపేట: ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

ఇంటింటా సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేశామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి కోరారు. సోమవారం టెక్కలి గ్రామ సచివాలయం-5 పరిధిలో ఆదిఆంధ్రావీధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్ల పాలనలో అందజేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, వార్డు సభ్యుడు టి.లోకేశ్వరరావు, నాయకులు దాలయ్య, డి.కృష్ణ, జె.శంకర్, జగన్, ఈశ్వరరావు, జానకి, రాజారావు, బాబూరావు, దేవ్, సింహాచలం, వేణు, డి.గోపి, వై.లక్ష్మి, చిన్నారావు, రాజేష్, వెంకటరమణ, హేమా, కూర్మారావు, వై.శివరాం, జి.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, ఎం.శంకర్, మురళీరెడ్డి, డి.లోకేష్‌రెడ్డి, సుధాకర్, శివపట్నాయక్, బి.శ్రీను పాల్గొన్నారు.

అనుమతుల్లేని భవన నిర్మాణంపై ఫిర్యాదు



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్

టెక్కలి: టెక్కలి-తెంబూరు రోడ్ జంక్షన్‌లో పాత అమర్‌నాథ్ లాడ్జీ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్న మూడంతస్తుల భవనం నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన స్పందన విభాగానికి 38 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా ఇంటి స్థలాలు, హుదూద్ ఇళ్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు పి.పరమేశ్వరరావు కోరారు. హుదూద్ భవనాల పరిసరాలను పరిశుభ్రం చేసి సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన జిల్లా నాయకుడు గేదెల రమణమూర్తి విన్నవించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి: మతోన్మాద శక్తులను వ్యతిరేకించి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలి అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి దహనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 25 జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి దళితులు, దళిత సంఘాల, ప్రజా సంఘాలు హాజరు కావాలని ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు డి.గణేష్, సమతా సైనిక్ దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు, డీహెచ్‌పీఎస్ నాయకులు వై.గోపి, డీటీఎఫ్ నాయకులు కె.ధర్మారావు, సీఐటీయూ నాయకులు ఎస్.షణ్ముఖరావు, లక్ష్మీ, వెంకటమ్మ, సిమ్మమ్మ, సరోజిని, తులసీ, నారాయణరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు

కవిటి: రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్-2023 పోటీల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో సత్తాచాటిన విజేతలను సోమవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు సత్కరించారు. వైష్ణవి, దేవరాజు, అరుణ్‌కుమార్‌లకు జ్ఞాపికల్ని అందించారు. వీరిలో దేవరాజు 3డీ ఆర్ట్‌విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించి ఢిల్లీలో జనవరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు హెచ్‌ఎం బెండాళం మల్లేశ్వరరావు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు పీబీకే శర్మను సన్మానించారు. కార్యక్రమంలో పి.శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వినోద్ మిశ్రాకు ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న లిబరేషన్ నాయకులు

పలాస: సి.పి.ఐ.ఎం.ఎల్. లిబరేషన్ పార్టీ నాయకుడు వినోద్ మిశ్రాకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళ్లు అర్పించారు. పలాస మండలం బొడ్డపాడు కాలనీలో సోమవారం వినోద్ మిశ్రా 25వ వర్ధంతి సభ నిర్వహించారు. లిబరేషన్ సీనియర్ నాయకుడు సారపాపయ్య చేతుల మీదుగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. వినోద్ మిశ్రాతో పాటు ఆ పార్టీ నాయకులు బక్సీ, జోహారు, నాగభూషణం పట్నాయక్ తదితర అమర వీరులుకు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య, పోతనపల్లి బాలరాజు, మద్దిల పాపారావు, మద్దిల వేమలయ్య, మద్దిల జగదీష్, బొడ్డు విజయ, తులసమ్మ, శివ, జోగారావు, నేతాజీ, తవిటయ్య, జానకిరావు, రామయ్య పాల్గొన్నారు.

దుర్గ్ రైలు పలాస వరకు పొడిగించండి



ఎంపీ విజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న కుమార్‌నాయక్

కాశీబుగ్గ: బిలాయ్ నుంచి విజయనగరం జంక్షన్ వరకు వస్తున్న దుర్గ్ ఎక్స్‌ప్రెస్ రైలును పలాస వరకు పొడిగించాలని ఉద్దాన, సముద్రతీర ప్రాంతాలకు చెందిన పలు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బిలాయిలో బీజేపీ ఎంపీ విజయ్ బఘేల్‌కు వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం, సముద్ర తీర ప్రాంతాలకు చెందిన అనేక మంది బిలాయిలో ఉపాధి పొందుతున్నారని, నిత్యం వేలాది మంది రాకపోకలు జరుపుతుంటారని, తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రా ఉత్కల్ సంఘర్ష సమితి అధ్యక్షులు కర్రి ఉమాశంకర్, ఆంధ్రప్రదేశ్ తరఫున హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయక్, కళాంజలి కల్చరల్ సంస్థ వ్యవస్థాపకులు కొరివి రాజు, యువజన సంఘ నేతలు బర్రి జోగారావు, పిల్ల దుర్యోధన, వంక రాజారావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతుల కల్పన



వీధిలైట్లు ప్రారంభిస్తున్న మృత్యుంజయరావు

కంచిలి: జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు అన్నారు. మకరాంపురంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎలుసూరి అప్పారావు, బెందాళం రమణస్వామి, సచివాలయ కన్వీనర్లు వజ్జ కృష్ణారావు, శమళ్ల రాంబాబు, వజ్జ కనకయ్య, వజ్జ త్యాగరాజు, వజ్జ శంకరరావు పాల్గొన్నారు.

మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శాంతికుమారి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి సోమవారం రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగ కమిటీ కార్యదర్శిగా శాంతికుమారి నియమితులు కావడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లొహరిబంద సర్పంచ్ రాపాక శేషగిరిరావు, నాయకులు రోణంకి వెంకటరమణ, కొల్లి నారాయణరావు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కోటబొమ్మాళి: మేజర్ పంచాయతీలోని పెద్దకొండవాలు ప్రాంతం, సాగునీటి గెడ్డ, పెద్ద చెరువు ప్రాంతాల్లో సుమారు 50 ఎకరాలను స్థానిక టీడీపీ నేతలు, ఇతర వ్యక్తులు గత ప్రభుత్వ హయాంలో ఆక్రమించుకున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ సర్పంచ్ కాల్ల సంజీవరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ గ్రీవెన్సుసెల్‌లో ఫిర్యాదు చేశారు. 185-2, 307-1, 250, 224, 229.251-1, 251-5, 253-15 సర్వే నంబర్లతో పాటు మరికొన్నిప్రాంతాల్లో భూఆక్రమణలు జరిగాయని, దీనివల్ల అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల మంజూరుకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, తక్షణమే ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'గుర్రాలతో తొక్కించిన చరిత్ర టీడీపీ నేతలదే'

టెక్కలి: అంగన్‌వాడీ సిబ్బందిని గుర్రాలతో తొక్కించిన నీచ చరిత్ర టీడీపీ నాయకులదేనని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని గుర్తు చేశారు. అంగన్‌వాడీ సమస్యలపై మాట్లాడే హక్కు చంద్రబాబు, అచ్చెన్నలకు లేదని దుయ్యబట్టారు. అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచడమే కాకుండా కొన్ని రకాల విధుల నుంచి తప్పించి వారికి వెసులుబాటు కల్పించినది సీఎం జగన్ అని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ధర్నాలు చేసే ముందు ఒక్కసారిగా గత ప్రభుత్వంలో జరిగిన కీడు, ప్రస్తుత ప్రభుత్వంలో కలిగిన మేలును గుర్తు చేసుకోవాలని మంజు విజ్ఞప్తి చేశారు.

'ప్రకృతి' కూరగాయలతో ఆరోగ్యం



కూరగాయల విక్రయం ప్రారంభిస్తున్న దృశ్యం

సోంపేట : ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. సోంపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగుచేసిన వివిధ రకాల కూరగాయల అమ్మకాల్ని సోమవారం నుంచి ప్రారంభించారు. ఇక్కడ రైతులే నేరుగా వచ్చి అమ్మకాలు సాగిస్తారని ఏపీఎం రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, సోంపేట మండల యాంకర్ కుమారి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, సీసీ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్య షష్ఠి



ఇచ్ఛాపురం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం



కవిటి: పాలకావిళ్లతో ఊరేగిస్తున్న దీక్షాధారులు

కవిటి: మండలంలోని పాతవరకలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. సకల గ్రహదోషాల నివారణకు సుబ్రహ్మణ ఆరాధన ఎంతో మేలు చేస్తుందని గురుస్వామి రమేష్ కుమార్ జెన్నా తెలిపారు. అనంతరం స్వాములంతా పాల కావిళ్లను భుజాన వేసుకుని సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, బెల్లుపడ శివానంద గిరిపై కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కల్యాణం జరిపించారు.

సంక్షేమ రథ సారథి సీఎం జగన్



టెక్కలి: బూరగాంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, సర్పంచ్ సంజీవరావు, నాయకులు జోగారావు



సోంపేట: ఉప్పలాం సచివాలయం వద్ద పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం పలు సచివాలయాల పరిధిలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నీలాపురంలో సోమవారం సీసీ రోడ్డు, కాలువ పనులకు చైర్మన్ బి.గిరిబాబు శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ కర్రి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఏఈ బీర అవినాష్, నాయకులు లక్ష్మణరావు, జోగారావు, అశోక్, కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.